సాక్షి నంద్యాల

బుధవారం । 16 ఏప్రిల్ । 2025



తెలుగు నాట కళా వైభవం!

ఉమ్మడి జిల్లాలో తెలుగు నాటకం ఒక వెలుగు వెలిగింది. జిల్లా కళాకారులు సినీ నటులకు సైతం ఆదర్శంగా మారిన సందర్భాలు ఉన్నాయి.

8లో▸



గోరుకల్లు పనులు పూర్తి చేయాలి

గోరుకల్లు జలాశయం పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు.

8లో▸



నష్టాల మునగ

మద్దికెర గ్రామానికి చెందిన రాయుడు అనే రైతు 5 ఎకరాల్లో మునగ సాగు చేసి నష్టపోయాడు. ధర లేకపోవడంతో పంటను వదిలేశానని చెబుతున్నాడు.

8లో▸

న్యూస్‌రీల్

గిన్నీస్ బుక్‌లో డోన్ విద్యార్థులకు చోటు



సర్టిఫికెట్, మెడల్ అందుకుంటున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణానికి చెందిన విద్యార్థులు కొండెపోగు జోనాథన్, కొండెపోగు సూసన్ గ్రేస్‌లు(అన్న చెల్లెలు) గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించారు. గతేడాది డిసెంబరు 1వ తేదీ విజయవాడలోని హాలేల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు ఆగస్టిన్ దండింగి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వీరు కీబోర్డ్ ప్లే వాయించారు. దానిని ఇంస్టాగామ్‌లో పోస్టు చేయగా.. 1,046 మంది అప్లోడ్ చేశారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్ వారు గుర్తించి ఈ నెల 14వ తేదీ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వీరికి మెడల్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి నోటు ఉత్తర్వుల మేరకు ఈ సమావేశాలను నిర్వహిస్తున్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పనులు, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగే ఈ సమావేశాలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు వారికి కేటాయించిన సమయంలో హాజరు కావాలని సీఈఓ కోరారు.

డాక్టర్ రవికృష్ణకు 'కందుకూరి' పురస్కారం



నంద్యాల(వ్యవసాయం): కందుకూరి రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారానికి నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ డాక్టర్ రవికృష్ణ ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం జయంతి, ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం విజయవాడలో కందుకూరి రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రస్థాయి పురస్కారానికి ముగ్గురిని ఎంపిక చేయగా అందులో డాక్టర్ రవికృష్ణ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి పురస్కారాలను అందజేయనున్నారు. డాక్టర్ రవికృష్ణ 2000 సంవత్సరంలో నంద్యాలలో కళారాధన సాంస్కృతిక సంస్థ స్థాపించారు. గత 25 సంవత్సరాలుగా కళ, నాటక రంగాలకు చేసిన విశిష్ట సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడానికి ఎంపిక చేశారు.

దాడి చేసింది ఎమ్మెల్యే అఖిలప్రియ అనుచరులే

- ఫిర్యాదు చేసిన బాధితుడు

ఆళ్లగడ్డ: టీడీపీ నాయకుడు సింగం భరత్‌రెడ్డిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అనుచరులే దాడి చేసినట్లు బాధితుడే తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే అనుచరులైన ఆరుగురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సింగం భరత్‌రెడ్డిపై సోమవారం పట్టణంలోని నాలుగు రోడ్లకూడలిలో దాడి జరిగిందన్నారు. ఈ దాడికి సబంధించి బాధితుడు భరత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన శివతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువు 11వ తేదీతో ముగిసింది. అయితే ప్రభుత్వం ఈ నెల 21వ తేదీ వరకు గడువును పొడిగించింది. జిల్లాలోని 27 కేజీబీవీలు ఉన్నాయి. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు చొప్పున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులను ఎంపిక చేస్తారు. ప్రతీ సంవత్సరం అన్ని తరగతులు కలిసి కస్తూరిబాలో 280 మంది విద్యనభ్యసిస్తున్నారు.

జగన్మాత.. దీవించమ్మా!

- శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కుంభోత్సవం
- గుమ్మడి, కొబ్బరి, నిమ్మకాయలతో భ్రమరాంబదేవికి సాత్వికబలి
- స్త్రీ వేషధారణలో పురుషుడు అమ్మవారికి కుంభహారతి
- అమ్మవారి నిజరూప దర్శనంతో పులకించిన భక్తులు



అమ్మవారికి గుమ్మడి కాయలు సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారికి సాత్వికబలి సమర్పిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం జగన్మాత అయిన శ్రీశైల భ్రమరాంబాదేవికి సంప్రదాయబద్ధంగా మంగళవారం వార్షిక కుంభోత్సవం నిర్వహించారు. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారాలలో ఏ రోజు ముందుగా వస్తే ఆ రోజు అమ్మవారికి సాత్వికబలిని సమర్పిస్తారు. ఈ సందర్భంగా శ్రీభ్రమరాంబాదేవి ఆలయాన్ని నిమ్మకాయల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంభోత్సవంలో భాగంగా ముందుగా ఉదయం అమ్మవారి ఆలయంలో రజకునితో ప్రత్యేక రంగవల్లిని వేయించారు. కుంభోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పం పఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆచారాన్ని అనుసరించి ఈ పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంగా జరిపించారు. శాంతి ప్రక్రియగా అధిక పరిమాణంలో పసుపు, కుంకుమలను కూడా అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ఏకాంతంగా పూజాదికాలను జరిపిన తరువాత సాత్వికబలికి సిద్ధం చేసిన రెండు వేలకుపైగా కొబ్బరి కాయలు, ఐదు వేల గుమ్మడికాయలు, 60వేలకు పైగా నిమ్మకాయలు, వండిన అన్నం (కుంభం)కు కూడా పూజాదికాలు జరిపించారు. స్థానిక వ్యాపార సంఘం వారు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, వండిన అన్నం అమ్మవారికి సాత్వికబలిగా సమర్పించారు. అనంతరం హరిహరరాయగోపుర ద్వారం వద్దగల మహిషాసురమర్దిని అమ్మవారికి (కోటమ్మవారికి) ప్రత్యేక పూజాదికాలు జరిపి, సాత్వికబలిగా కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయంలో రజకునితో ప్రత్యేక ముగ్గు వేయించిన శ్రీచక్రం వద్ద విశేషపూజలు నిర్వహించారు. సాయంకాలం శ్రీమల్లికార్జున స్వామి వారికి ప్రదోషకాలపూజల అనంతరం అన్నాభిషేకం జరిపించారు. అలాగే సాయంకాలం అమ్మవారికి ఎదురుగా ఉండేవిధంగా సింహమండపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా సమర్పించారు. కుంభోత్సవ పూజా కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు అయన్న, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




అమ్మవారి ఆలయం వద్ద రంగవల్లి

అమ్మవారికి కుంభహారతి

సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించారు. దీంతో ఉత్సవంలో ప్రధానఘట్టం ప్రారంభమైంది. అనంతరం రెండో విడత సాత్వికబలిగా గుమ్మడికాయలు, కొబ్బరికాయలు సమర్పించారు.

అమ్మవారి నిజరూపదర్శనం

శ్రీభ్రమరాంబాదేవికి విశేషపూజాదికాలు నిర్వహించిన అనంతరం అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కలిగించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. చివరిగా అమ్మవారికి పునఃపూజలను చేసి పలు రకాల వంటకాలతో మహానివేదన చేశారు. ఈ ఉత్సవంలో భాగంగానే గ్రామదేవత అంకాళమ్మకు కూడా ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు.



నిమ్మకాయలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించిన దృశ్యం



అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న అర్చకుడు



అమ్మవారి ఆలయం వద్ద కుంభఅన్నరాశి

శారీరక వికలాంగుల హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్):స్థానిక సి.క్యాంప్‌లోని ప్రభుత్వ శారీరక వికలాంగుల వసతిగృహంలో 2025 -26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఉమ్మడి జిల్లాలో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. హాస్టల్ లో 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. హాస్టల్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత భోజన వసతి, పుస్తకాలు, దుస్తులు, కాస్మోటిక్ చార్జీలు తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08518-277864 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

తెల్ల బంగారం క్వింటా రూ.8,021

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటా పత్తి ధర రూ.8,021 నమోదైంది. గత వారంలో ధర రూ.8 వేల లోపే ఉంది. మంగళవారం రైతులు 988 క్వింటాళ్ల పత్తి దిగుబడులుతీసుకు రాగా గరిష్ట ధర రూ.8,021, మధ్య ధర రూ.7,525, కనిష్ట ధర రూ.4,250 పలికింది. అదేవిధంగా వేరుశనగకాయలు 2,789 సంచులు రాగా గరిష్ట ధర రూ.6,456, మధ్య ధర రూ.6,202, కనిష్ట ధర రూ.3,466 నమోదైంది. ఆముదాలు వంద సంచులు రాగా గరిష్ట ధర రూ.6,120, మధ్య ధర రూ.6070, కనిష్ట ధర రూ.5500.. కందులు 8 సంచులు రాగా గరిష్ట ధర రూ.6,313, మధ్య ధర రూ.5,263, కనిష్ట ధర రూ.5,263 పలికింది.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

కర్నూలు(హాస్పిటల్): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఇటీవల నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూ దరఖాస్తులను పరిశీలించి మెరిట్ జాబితాను ఈ నెల 16వ తేదిన ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి. శాంతికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఫిబ్రవరి 15న ఫార్మాసిస్ట్ గ్రేడ్-2, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జీఎస్ పోస్టులకు నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఈ మెరిట్‌జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలివ్వాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు 12 వారాల పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి నరసింహనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని, పని చేసే ప్రదేశంలో మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. మంచినీళ్లు ఏర్పాటు చేయాలని చట్టం చెబుతున్నా అధికారులు అమలు చేయడం లేదన్నారు. ఉపాధి హామీ పథకంలో అధికార పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు స్వాములు, బాలయ్య, ఈశ్వరమ్మ, బాషా, మద్దిలేటి, వీరభద్రుడు, కరీం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 95552300009 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

తీర్థావళితో ముగిసిన బ్రహ్మోత్సవాలు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాలు తీర్థావళి కార్యక్రమంతో మంగళవారం ముగిశాయి. తొలుత ఆలయం వద్ద వడపప్పు, పానకాలను భక్తులకు పంపిణీ చేశారు. రంగులబండిని కట్టి గ్రామస్తులు ఒకరిపై ఒకరు ఆనందంగా రంగులు చల్లుకుంటూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. సాయంత్రం వేళలో స్వామివారికి మహా నైవేద్యం, మహా మంగళహారతినిచ్చి అర్చకులు వేదమంత్రాల మధ్య స్వామివారి బ్రహ్మోత్సవాలను ముగించారు.



తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి

వైభవంగా సుశమీంద్రతీర్థుల ఆరాధన



బంగారు రథంపై సుశమీంద్ర తీర్థుల చిత్రపటం ఊరేగింపు

మంత్రాలయం: నడిచే రాఘవేంద్రులుగా పేరుగాంచిన శ్రీరాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుశమీంద్రతీర్థుల ఆరాధన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల నేతృత్వంలో స్వామిజీ ఆరాధన వేడుకలు కనుల పండువగా చేపట్టారు. ముందుగా సుశమీంద్రతీర్థుల మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం గావించి విరుల అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన చిత్ర పటాన్ని బంగారు రథంపై శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. గురుసార్వభౌమ సాహిత్య మండలి భజనలు, కీర్తనలు, వేద పాఠశాల విద్యార్థుల వేద ఘోష, మంగళవాయిద్యాల మధ్య రథయాత్ర కనుల పండువగా కొనసాగింది.

వెంకన్న పట్టువస్త్రాల సమర్పణ

నడిచే రాఘవేంద్రుల ఆరాధన సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. స్థానిక టీటీడీ కల్యాణ మంటపం నుంచి ఆలయ ఏఈఓ మోహన్‌రాజు పట్టువస్త్రాలతో మంగళవాయిద్యాలతో శ్రీమఠం చేరుకున్నారు. పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు శాస్త్రోక్తంగా పట్టు వస్త్రాలు స్వీకరించారు. అనంతరం సుశమీంద్రతీర్థుల మూల బృందావనం చెంత పట్టువస్త్రాల పూజోత్సవం కానిచ్చారు. వేడుకలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-ఎ వెంకటేష్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

ఆ'ధర'ణ లేక అన్నదాత విలవిల

- మొక్కజొన్న పంటకు లభించని మద్దతు ధర
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న

కోవెలకుంట్ల: రబీలో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో మార్కెట్‌లో నష్టానికి పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. నెల రోజుల క్రితం వరకు క్వింటా రూ. 2,400 వరకు ధర పలుకగా ప్రస్తుతం రోజు రోజుకు పతనమవుతోంది. ప్రస్తుత మార్కెట్‌లో క్వింటా రూ. 2వేలకు మించి పలకడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 10 వేల హెక్టార్లలో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. అవుకు మండలంలో 1,063 , సంజామల మండలంలో 404, కొలిమిగుండ్ల మండలంలో 138, ఉయ్యాలవాడ మండలంలో 117, కోవెలకుంట్ల మండలంలో 22 , దొర్నిపాడు మండలంలో 30 హెక్టార్లలో మొక్కజొన్న సాగైంది. మొత్తం 120 రోజుల పంట కాలం కలిగిన పైరులో ఆయా మండలాల్లో కోత, నూర్పిడి పనులు దాదాపు పూర్తికావచ్చాయి. కల్లాల్లో పంటను ఉంచి రైతుల అష్ట కష్టాలు పడుతున్నారు.

వెంటాడిన ఎండు తెగులు

జిల్లాలోని రైతులు కొన్ని సంవత్సరాల నుంచి పంటమార్పిడి చేయకుండా ప్రతి ఏటా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా మొక్కజొన్న పంట సాగు చేశారు. పైరు కంకిదశలో ఉండగా గత ఏడాది అక్టోబర్ నెలలో తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పంట దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలకు పైగా వెచ్చించినా ఎకరాకు 22 నుంచి 30 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే ఉండి ఆధరకే విక్రయించి నష్టాల ఊబిలో కూరకపోయారు. ఈ నష్టాన్ని పూడ్చుకోవచ్చని కోటి ఆశలు పెట్టుకుని రబీలో తిరిగి అదే పొలాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. రెండు సీజన్లలో ఒకే రకమైన పంట కావడంతో పైరును విల్ట్(ఎండు తెగులు) వెంటాడింది. వివిధ దశల్లో తెగులు ఆశించి మొక్కజొన్న కర్రలు ఎండిపోయాయి. ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ 35 వేల వరకు రైతులు ఖర్చు చేశారు. అష్టకష్టాలు పడినా ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. దిగుబడులు తగ్గినా మార్కెట్‌లో మద్దతు ధర లభించలేదు. ఆపదలో వెన్నుదన్నుగా నిలువాల్సిన కూటమి సర్కార్ రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో అదనపు భారం

ఎండుతెగులు, మద్దతు ధర లేక అవస్థలు పడుతున్న రైతులపై మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. గత నెల నుంచి ఇప్పటి వరకు ఇప్పటికే మూడు సార్లు అకాల వర్షాలు కురిసి రైతులకు నష్టం చేకూరింది. కోత, నూర్పిడి దశలో వర్షాలు పడటంతో దిగుబడులు తడిచిపోయాయి. వర్షాలబారి నుంచి దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉత్పత్తులపై పట్టలు కప్పినా పట్టల్లోనుంచి నీరు దిగి తడిచిపోతుండటంతో ఆవేదన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాలు, కలాల్లో దిగుబడులు ఆరబోసుకుని గింజల నాణ్యతను కాపాడుకునేందుకు అగచాట్లు పడుతున్నారు. వాతావరణంలో మార్పు సంభవిస్తే పట్టలు కప్పుకోవడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో దిగుబడులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునేందుకు అదనపు భారం పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మొక్కజొన్నకు మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడులు విక్రయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల ఊసేలేదు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసింది. విత్తనానికి ముందే ఆయా పంటలకు మద్దతు ధర ప్రకటించి ఆదుకుంది. వివిధ పంటల ఉత్పతులను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాతను పట్టించుకోవడం లేదు. పంట చేతికందేనాటికి మార్కెట్‌లో ధర తగ్గుముఖం పడితే మద్దతు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా పట్టించుకోకపోవడం రైతులకు శాపంగా మారింది. మద్దతు ధరకంటే మార్కెట్‌లో తక్కువ ధర పలుకుతుండటంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మొక్కజొన్నలో కోత, నూర్పిడి పనులు పూర్తి అయి దిగుబడులు చేతికందినా కొనుగోలు కేంద్రాల ఊసే లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ధర నిర్ణయిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

"మళ్లీ వర్షం వస్తే నష్టమే



నేను తొమ్మిది ఎకరాలు పొలాన్ని ఎకరాకు రూ. 30 వేలు కౌలు చెల్లించి కౌలుకు తీసుకున్నా. ఖరీఫ్‌లో మినుము వేశాం. రబీలో మొక్కజొన్న వేయగా ఎకరాకు రూ. 30 వేల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పైరు కోత దశలో ఉంది. గత నెల నుంచి అకాల వర్షాలు దెబ్బతీశాయి. మళ్లీ వర్షం వస్తే దిగుబడులు తడిచి నష్టం వాటిల్లుతుంది.

– భూపాల్‌రెడ్డి రైతు, ఆకుమల్ల,సంజామల మండలం

రైతులను ఆదుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలతో మొక్కజొన్నలో దిగుబడులు తగ్గాయి. రబీ సీజన్‌లో మొక్కజొన్నకు మార్కెట్‌లో మద్దతు ధర అంతంత మాత్రంగానే ఉంది. ఎరువులు, పురుగు మందులు, తదితర ఖర్చుల రూపంలో పెట్టుబడులు పెరిగాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులను కొని రైతులను ఆదుకోవాలి. – సుధాకర్‌రెడ్డి, రైతు కంపమల్ల,కోవెలకుంట్ల మండలం

మద్దతు ధర లేదు



రబీ సీజన్‌లో రెండు ఎకరాల సొంత పొలంలో మొక్కజొన్న వేశా. ఎండు తెగులు రావడంతో పంటను కాపాడుకునేందుకు కష్టాలు పడ్డాను. పెట్టుబడి పెరిగింది. దిగుబడి మాత్రం అరకొరే. మార్కెట్‌లో మద్దతు ధర లేదు. చాలా నష్టం వచ్చింది.

– కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

క్లుప్తంగా

నక్కవాగుల పల్లెలో పూరిగుడిసె దగ్ధం

● రూ.3 లక్షల ఆస్తినష్టం

డోన్: కొత్తకోట మజరా గ్రామమైన నక్కవాగులపల్లె గ్రామంలో మంగళవారం ఉదయం మహమ్మద్ రఫీ అనే వ్యక్తికి చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. కుటుంబీకులు పనికెళ్తూ గుడిసెకు తాళం వేసి వెళ్లారు. అయితే కొద్ది సేపటి తర్వాత గుడిసె దగ్ధమవుతుండటంతో గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చేలోగా గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 4 తులాల బంగారు నగలతో పాటు ఏడాదిపాటు నిల్వ ఉంచిన నిత్యావసర వస్తువులు, కొంత నగదు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు మహమ్మద్ రఫీ కుటుంబం కన్నీరు మున్నీరైంది. దాదాపు రూ. 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ చంద్రన్న యాదవ్ తహసీల్దార్ నాగమణిని కోరారు.

చెరువులో వ్యక్తి గల్లంతు


బొనిగెని వెంకటేశ్వర్లు (ఫైల్)

పాణ్యం: భూపనపాడు గ్రామ చెరువులో అదే గ్రామానికి చెందిన బొనిగెని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గల్లంతైనట్లు కుటుంబీకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 13వ తేదీన వెంకటేశ్వర్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలసి చెరువులో చేపట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులుగా గాలిస్తున్నా ఆచూకీ తెలియ లేదని పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరికి చెందిన పడిగే సుధాకర్ అనే వ్యక్తి నుంచి 13 బాక్స్‌ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరించారు. గ్రామ శివారులోని ఉప్పరి మాదన్న పొలం సమీపంలోని చేపల గుంత వద్ద పడిగే సుధాకర్ అక్రమంగా మద్యాన్ని దాచినట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. 1,248 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్ని నిందితున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యాన్ని సరఫరా చేసిన తుగ్గలి మండలం కొత్తపల్లి గుడిసెల గ్రామానికి చెందిన రాజేంద్రపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

పాణ్యం: ఆటో ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కొణిదేడు భూపనపాడు రస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఫజులుల్లా వివరాల మేరకు.. కొణిదేడు గ్రామానికి చెందిన కాటసాని రామలక్ష్మమ్మ (65)పొలం వద్ద ట్రాక్టర్ దిగి రోడ్డు దాటుతుండగా భూపనపాడు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. రామలక్ష్మమ్మ తీవ్రంగా గాయ పడింది. ఆమెను కుటుంబ సభ్యులు శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు రవిరెడ్డి ప్రస్తుతం కొణిదేడు ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. రెండో కుమారుడు రాజారెడ్డి రైతు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమి త్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘట నా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

తెలుగు నాటక కళా వైభవం!

● నాటక సమాజాలతో సామాజిక చైతన్యం
● రంగ స్థలానికి వన్నె తెచ్చిన ఉమ్మడి జిల్లా కళాకారులు
● సంచలనం సృష్టించిన పులిస్వారీ నాటకం
● నేడు తెలుగు నాటక రంగ దినోత్సవం
● కందుకూరి వీరేశలింగం జయంతి

నాటకం సమకాలీన సమస్యలకు దర్పణం. 'నాటకం.. చిటికెడు వినోదాన్ని, గుప్పెడు అనుభవాలు, దోసెడు అనుభూతులు, చారెడు విజ్ఞానాన్ని ప్రేక్షకులకు పంచి పెడుతుంది'.. అని చెప్పాడో రచయిత. చరిత్రకు ప్రతిబింబం. సంఘ పరిణామాలను పసిగట్టి దగ్గరగా చూపెట్టే చుక్కాని. విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక చైతన్యాన్ని ప్రసాదించే వేదిక నాటకం. ఇంతటి అమోఘమైన రంగం చవి చూసిన అటుపోట్లెన్నో.. అయినా ఇప్పటికీ తన ప్రాభవాన్ని చాటుతూనే ఉంది. తెలుగు నాటక రంగ స్థల వైభవం సుస్థిరం.. సుమధరం.. నవరస భరితం.

– కర్నూలు కల్చరల్


పద్య నాటకంలోని సన్నివేశం

పల్లె సీమల్లో 1960 నుంచి1990 వరకు నాటక కళ ఒక మహా వైభవాన్ని కలిగి ఉండేది. ప్రతి పల్లెలో దసరా, సంక్రాంతి, తిరునాళ్ల సందర్భంగా పౌరాణిక నాటక ప్రదర్శనలు వైభవోపేతంగా నిర్వహించేవారు. ఉమ్మడి జిల్లాలో తెలుగు నాటకం ఒక వెలుగు వెలిగింది. జిల్లాలోని లొద్దిపల్లె అల్లాబక్ష్, వెల్దుర్తి వెంకటనర్సు నాయుడు, రజనీబాయి లాంటి రంగస్థల కళాకారులు రాష్ట్ర వ్యాప్తంగా నాటక ప్రదర్శనల్లో పాల్గొని రంగస్థలాన్ని సుసంపన్నం చేశారు. ఈ కళాకారులు సినీ కళాకారులకు సైతం ఆదర్శంగా మారిన సందర్భాలు ఉన్నాయి. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన నాటక రంగం నిన్న మొన్నటి వరకు తారా స్థాయిలో ఉంది. నేడు వివిధ కారణాలతో తిరోగమన దశలో ఉంది. తెలుగు నాట మొదటి నాటక రచయిత, సంఘ సంస్కర్త కందూకూరి వీరేశం లింగం పంతులు. మొదటి నాటక ప్రదర్శన కర్త కూడా ఆయనే. అందుకే ఆయన జన్మదినాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన 'తెలుగు నాటక రంగ దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పౌరాణిక, సాంఘిక నాటకాల వేదికగా అలరారుతోంది. 1940 ప్రాంతం నుంచే జిల్లాలో పౌరాణిక నాటకాలను నేర్పించి ప్రదర్శించే వారు. నంద్యాలలో బాల్కొండ థియేటర్, కర్నూలులో జిల్లా పరిషత్‌లోని ఆడిటోరియం, మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్, జిల్లా కోర్టు సమీపంలో యునైటెడ్ క్లబ్, సీక్యాంప్‌లోని లలిత కళాసమితి (టీజీవీ కళాక్షేత్రం), నంద్యాల కళారాధన, జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం , విజేత ఆర్ట్స్, ప్రజా నాట్యమండలి, తదితర నాటక సంస్థలు ఇప్పటికే నాటక రంగానికి వన్నె తెస్తూ పని చేస్తున్నాయి. ఈ నాటక సమాజాలు విభిన్న కథాంశాలతో నాటకాలను రూపొందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శితమై ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నారు. నంది నాటక పోటీల్లో జిల్లా నాటక సమాజాలు అగ్రభాగాన నంది పురస్కారాలను అందుకుంటున్నారు.

జిల్లాలో రాష్ట్ర స్థాయి కళాకారులు

కర్నూలు జిల్లాలో నాటక రంగ పరిస్థితి చూస్తే తురిమెల్ల గ్రామానికి చెందిన వెంకటాద్రి సోదరులు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చక్కని సెట్టింగులు, లైటింగ్‌లతో నాటక ప్రదర్శనలు ఇచ్చారు. 1940 ప్రాంతంలో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఆర్థిక వనరుల లేమితో ఈ సంస్థ మూత పడింది. బండి ఆత్మకూరుకు చెందిన బీకే రామసుందర్ రావు, చెలిమెల్ల గ్రామానికి చెందిన కేసీ శివారెడ్డి, వెల్దుర్తి వెంకటన నర్స నాయుడు, లొద్దిపల్లె అల్లాబక్ష్, రజనీబాయి, మల్లారెడ్డి, పత్తి ఓబులయ్య, బీసీ కృష్ణ, సంజన్న, గుర్రపుసాల అంకయ్య, పత్తికొండ రంగారెడ్డి, నంద్యాల బుర్రా వెంకటేశ్వర్లు, పులిపాటి రామమకృష్ణ, శారద, డాక్టర్ రవికృష్ణ, ఎస్ఆర్ఎస్ ప్రసాద్, వి.వి. రమణారెడ్డి వంటి నటులు నాటక రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు.

నందుల పంట పండించిన కళాకారులు

కర్నూలు లలిత కళా సమితి, నంద్యాల కళారాధన సంస్థలు కొత్త తరహాలో నాటకాలను రూపొందించి ప్రదర్శిస్తూ నంది పురస్కారాలను కైవసం చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు రెండు సంస్థలు సుమారు 45 దాకా నంది పురస్కారాలు వరించి ఉంటాయి. ఇందులో 20 దాకా బంగారు నంది పురస్కారాలు ఉండటం విశేషం. లలిత కళా సమితి ఆధ్వర్యంలో రాయలసీమ ముఠా కక్షలపై పులిస్వారి నాటకం 130 ప్రదర్శనలు ఇచ్చి సంచలనం సృష్టించింది. ఇదే సంస్థ అత్యధికంగా 38 నంది అవార్డులు సాధించింది. జిల్లా కళాకారులు అత్యుత్తమ నటనా ప్రతిభతో నంది అవార్డులతో పాటు జాతీయ స్థాయి గరుడ, కందుకూరి పురస్కారాలు కైవసం చేసుకున్నారు.


సాంఘిక నాటకంలోని సన్నివేశం

“ యువత ముందుకు రావాల్సిన అవసరం ఉంది



నాటక రంగం పుంజుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో సాంకేతిక విప్లవంతో నాటక రంగం పోటీ పడలేకపోయింది. పల్లెటూర్లలో ఇప్పటికీ జరిగే తిరునాళ్ల జాతర్లలో తెల్లవార్లు నాటకాలు వేస్తున్న పరిస్థితి ఉంది. సాంఘిక నాటకాలు అంతగా ప్రదర్శితం కావడం లేదు. పద్య నాటకాలకే ఆదరణ ఉంది. ఇప్పటికే సినిమా, టీవీలు లాంటి వాటి వల్ల కొంత మోజు తగ్గింది. రంగస్థల కళలోకి యువతీ యువకులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పత్తి ఓబులయ్య, అధ్యక్షుడు, టీజీవీ కళాక్షేత్రం

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారులను ప్రోత్సహిస్తూ కళలను బ్రతికించుకోవాల్సిన అవసరం ఉంది. మా కళారాధన సంస్థ ద్వారా నటనలో శిక్షణ ఇవ్వడంతో పాటు నాటకాలను ప్రదర్శిస్తున్నాం. నాటక పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నాం. మరికొందరు కళా పోషకులకు ముందుకు వస్తే రంగస్థలం లాంటి కళలను భావితరాలకు అందించేందుకు అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గుర్రాల రవికృష్ణ, కళారాధన సంస్థ అధ్యక్షుడు, నంద్యాల

కళాకారులకు చేయూత ఇవ్వాలి



మూడు దశాబ్దాలకు పైగా నేను నాటకాల్లో పాత్రలు వేస్తున్నాను. ప్రస్తుతం నాటక ప్రదర్శనలు బాగా తగ్గిపోయాయి. కళాకారులకు నాటకాలు లేక బతుకుదెరువు కష్టంగా మారింది. ప్రభుత్వం, కళా సంస్థలు కళా పోషకులు చేయూత అందిస్తే కళను నమ్ముకుని జీవిస్తున్న వారికి జీవనోపాధి లభిస్తుంది.

– ఎం.ఆర్.రాధిక, సీనియర్ రంగస్థల కళాకారిణి

గోరుకల్లు పెండింగ్ పనులు పూర్తి చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బొజ్జ దశరథరామిరెడ్డి తదితరులు

పాణ్యం: రాయలసీమకు గుండెకాయగా భావించే గోరుకల్లు జలాశయం పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సార్బీసీ ఆయకట్టు సాధన సమితి నాయకులు, ఆయకట్టు రైతులు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బొజ్జ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు తాగు, సాగునీటిని అందించే ప్రాజెక్టులలో గోరుకల్లు జలాశయం కీలకమైందన్నారు. అలాంటి ప్రాజెక్టు అసంపూర్తి పనులతో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 12.44 టీఎంసీలు కాగా కేవలం 11 టీఎంసీలకే పరిమితమైందన్నారు. వరద జలాలను నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కళ్ల ముందు వరద నీరు సముద్రం పాలవుతున్నా పాలకులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే గోరుకల్లు పెండింగ్ పనులు పూర్తి చేసి రైతులు, ప్రజల్లో నెలకొన్న భయాన్ని తొలగించాలన్నారు. రిజర్వాయర్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సార్బీసీ ఆయకట్టు సాధన సమితి నాయకలు మురళీనాథ్‌రెడ్డి, గోపిరెడ్డి, యాగంటి, బసవేశ్వర రైతు సంఘం కన్వీనర్ కొండారెడ్డి, శేషిరెడ్డి, సమాజ్‌పార్టీ నాయకులు శివ కృష్ణయాదవ్, ఏఐఎఫ్‌బీ నాయవకులు వెంకటాద్రి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ప్రతాప్, ప్రసాద్‌రెడ్డి, సీతక్క, సూర్యమహేశ్వరరెడ్డి, ఎరువ రాచంద్రారెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను వదిలేసి చిరుద్యోగులపై వేటు

కోడుమూరు రూరల్: ఆన్‌లైన్‌లో పొలం ఎక్కించేందుకు డబ్బులు తీసుకుని లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వీఆర్వోలను మంగళవారం బదిలీ చేస్తూ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కోడుమూరు, ప్యాలకుర్తి, పులకుర్తి గ్రామాల వీఆర్వోలు నారాయణ, వెంకట్రాముడు, పరమేష్‌లు ఆన్‌లైన్‌లో పొలం ఎక్కించేందుకు రూ.లక్ష తీసుకోవడంతో పాటు, తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ ఈనెల 8వ చాకలి హైమావతి అనే మహిళ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫినాయిల్ తాగి తహసీల్దార్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై విచారణ చేసిన జిల్లా అధికారులు ముగ్గురు వీఆర్వోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. వీఆర్వో నారాయణను మంత్రాలయం మండలంలోని మంచాల గ్రామానికి బదిలీ చేయగా, వీఆర్వో పరమేష్‌ను దేవనకొండ మండలం గుండ్లకొండ, వీఆర్వో వెంకట్రాముడు ను నందవరం మండలం ముగతి గ్రామానికి బదిలీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

అలాగే కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామాంజనేయులును కూడా ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు. కాగా మహిళ హైమావతి ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌ను వదిలేసి డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులును బదిలీ చేయడంలో ఆంతర్యమేమిటని ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. సదరు మహిళ తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు కూడా డబ్బులిచ్చానంటూ ఆరోపించినా ఆ కోణంలో జిల్లా అధికారులు విచారణ చేయకుండా కేవలం చిరు ఉద్యోగులపై మాత్రమే వేటు వేయడం, ఈ సమస్యకు సంబంధం లేని డిప్యూటీ తహసీల్దార్‌ను బదిలీ చేయడంలో గల కారణాలను తెలపాలంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన సాబీరా

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని రాంభూపాల్‌నగర్ కాలనీలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కాలనీకి చెందిన ఎస్ మహమ్మద్‌రఫీ భార్య సాబీరా(30) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే సాబీరా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుటుంబీకులు ఇప్పటి వరకు స్టేషన్‌కు రాలేదని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

కర్నూలు (సెంట్రల్) : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన కర్నూలులో చోటు చేసుకుంది. నాల్గవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన పల్లె మహేశ్వర్ రెడ్డి (44) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.20 గంటలకు తన బైక్‌పై పెద్దపాడు నుంచి బళ్లారి చౌరస్తా వైపు వస్తుండగా వై-జంక్షన్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆటో.. బైక్‌పాటు మరో రెండు ఆటోలను ఢీకొట్టింది. ఈ ఘటనలో పల్లె మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని 108 వాహనంలో ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదం ఆటో డ్రైవర్ చాకలి బాలచందర్ అతివేగం, అజాగ్రత్త వల్లనే జరిగిందని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

● సొంత పార్టీ నాయకులే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
● నందివర్గం పోలీసులు కొట్టడంతో మనస్తాపం


అవుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వరదరాముడు

కొలిమిగుండ్ల: బెలుం శింగవరానికి చెందిన టీడీపీ కార్యకర్త వరదరాముడు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వారం రోజుల క్రితం బనగానపల్లె మండలం నందవరంలో విందు ఉండటంతో అక్కడికి వెళ్లాడు. అక్కడే బెలుం శింగవరంకు చెందిన టీడీపీ నాయకులతో వాగ్వావాదం చోటు చేసుకుంది. ఈ ఘటనపై వాళ్లు నందివర్గం పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వరదరాముడిని కొట్టడంతో కాళ్లకు గాయాలయ్యాయి. తర్వాత వారం రోజుల పాటు ఊర్లోకి వెళ్లకూడదని హెచ్చరించారు. అప్పటి నుంచి నంద్యాల సమీపంలోని అత్తగారింట్లో ఉంటున్నాడు. అంతటితో ఆగకుండా టీడీపీ నాయకులు మళ్లీ కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు చేశారు. నందివర్గం తరహాలో ఇక్కడ పోలీసులు తమను కొడతారనే భయాందోళన చెందాడు. మంగళవారం అత్తగారి ఊరు నుంచి వస్తూ మార్గమధ్యలో సంజామల మండలం ఆకుమల్లలో క్రిమిసంహారక మందు కొనుగోలు చేసి బెలుం శింగవరానికి చేరుకున్నాడు. సొంత పొలంలోకి వెళ్లి ఫేస్‌బుక్ లైవ్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించి మందు తాగి చెట్టు కింద పడిపోయాడు. లైవ్‌లో చూసిన గ్రామస్తులు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబుకు సమాచారం ఇచ్చారు. బాధితుడి సెల్ ఫోన్ ఆధారంగా సాంకేతిక సాయంతో లోకేషన్ గుర్తించి సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అప్పటికి అపస్మారక స్థితిలో ఉండగా చికిత్స కోసం అవుకు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కర్నూలుకు తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శంకరరెడ్డి, రామ్మోహన్, వెంకటసుబ్బయ్య వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని బాధితుడు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని సీఐ పేర్కొన్నారు.

పత్తి విత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో తనిఖీలు


పత్తి విత్తన ప్రాసెసింగ్ పరిశ్రమలో హెచ్‌టీ పరీక్షలు నిర్వహిస్తున్న కమీషనరేట్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): బీటీ పత్తి విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ చురుగ్గా జరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన అధికారులు తనిఖీలు చేపట్టారు. పత్తిలో హెచ్‌టీ విత్తనాలను గుర్తించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. హెచ్‌టీ పత్తి విత్తనాలు పర్యావరణానికి, జీవవైవిద్యానికి హాని కలిగిస్తాయనే ఉద్దేశంతో వీటికి కేంద్రం అనుమతులు ఇవ్వలేదు. హెచ్‌టీ విత్తనాల గ్లైపోసేట్ అనే కలుపు మందును తట్టుకుంటాయి. హెచ్‌టీ విత్తనాలతో పత్తి సాగు చేసినపుడు కలుపు సమస్య ఏర్పడితే గ్లైపోసేట్ మందు పిచికారి చేస్తే కలుపు మొక్కలు నశిస్తాయి.. పత్తి పంటకు ఏమీ కాదు. గ్లైపోసేట్ కలుపు మందు పిచికారి చేస్తే పర్యావరణం దెబ్బతింటుందనే ఉద్దేశంతో అనుమతులు లేవు. కాని హెచ్‌టీ పత్తి విత్తనాలు మార్కెట్‌లో ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కమిషనరేట్ నుంచి ఏడీఏ కల్యాణ్‌కుమార్, ఏవో లక్ష్మిరెడ్డిలతో కూడిన టీమ్ కర్నూలులో తనిఖీలు చేపట్టింది. కర్నూలులో బీటీ పత్తి విత్తనాల ప్రాసెసింగ్ ప్రక్రియ ప్రస్తుతం శ్రీరామ సీడ్స్, కర్నూలు సీడ్స్, ధనలక్ష్మి సీడ్స్, మహలక్ష్మి సీడ్స్, విజయసాయి, గౌతమీ సీడ్స్‌లో జరుగుతోంది. ప్యాకింగ్‌కు ముందే హెచ్‌టీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు ఆయా ప్రాసెసింగ్ కేంద్రాల్లో లాట్ల వారీగా హెచ్‌టీ పరీక్షలు నిర్వహించారు. అక్కడికక్కడే 11 పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చింది.అంటే హెచ్‌టీ విత్తనాలు లేవని నిర్ధారణ అయింది. కర్నూలులో తనిఖీలు పూర్తి అయిన తర్వాత ఈ టీమ్ అధికారులు ఆదోనిలో పరీక్షలు నిర్వహించారు. వారి వెంట కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



ఉపాధినిచ్చే చోటే వారికి నీడ

చిన్నారులందరూ అక్కడికి చేరి ఆటలాడుతూ ఉత్సాహంగా ఉంటారు. అందరూ ఉత్సాహంగా ఉన్నా ఆ చిన్నారులు మాత్రం ఉపాధినిచ్చే చోటే నీడను పొందాల్సి వస్తుంది. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో ఓ కుటుంబం చిన్నారుల కోసం ఆటలాడే పరికరాలు ఏర్పాటు చేసి జీవనోపాధి పొందుతున్నారు. వారి కుటుంబానికి చెందిన చిన్నారులు ఆ పరికరాల క్రింద ఉన్న కొద్దిపాటి నీడనే సేదతీరుతూ.. ఆహారం తీసుకుంటూ, విశ్రాంతి పొందుతున్న దృశ్యాలను మంగళవారం 'సాక్షి' కెమెరాలో బంధించింది.

–మహానంది

ఏడీఏ వేదమణి గిన్నీస్ రికార్డు

● గంటలో 1,046 సరళీ స్వరాలు ఆలపించి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్


సర్టిఫికెట్, పతకంతో ఏడీఏ వేదమణి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రంలో ఏడీఏగా పని చేస్తున్న వేదమణికి సంగీతంలో అరుదైన గౌరవం లభించింది. చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకున్న ఆమె.. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టీన్ దగ్గర ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో సంగీతం నేర్చుకున్నారు. ఈ క్రమంలో అనేక క్రైస్తవ పాటలను చర్చిల్లో పాడటమే కాకుండా సొంతంగా పాటలు రాసి ఆలపించారు. గత ఏడాది డిసెంబరు 1వ తేదీన కేవలం ఒక గంట సమయంలో 1,046 మంది సరళీ స్వరాలు ఆలపించి వీడియోలను ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందుకు గిన్నీస్ వరల్డ్ రికార్డు వారు సర్టిఫికెట్, పతకం బహుకరించారు. వీటిని ప్రపంచ క్రైస్తవ బోధకులు అనిల్ కుమార్ ఈ నెల 14న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. గిన్నీస్ రికార్డు లభించడం పట్ల ఆనందంగా ఉందని ఏడీఏ వేదమణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

నష్టాల మునగ

వ్యవసాయంలో లాభాలు ఆర్జించాలంటే అదృష్టం ఉండాలి. ప్రకృతి అనుకూలి పంట బాగా పండినా మార్కెట్‌లో ధర లేకపోతే నష్టాలు మూట గట్టుకోవాల్సిందే. ఈ ఏడాది పత్తి, మిరప, శనగ, కంది తరహాలోనే మునగ రైతుల పరిస్థితి కూడా అంతే. సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర పతనమైంది. కనీసం కూలీల ఖర్చు కూడా రాకపోవడంతో కొందరు రైతులు పంటను చేన్లలోనే వదిలేస్తున్నారు. మద్దికెర గ్రామానికి చెందిన రాయుడు అనే రైతు కూడా 5 ఎకరాల్లో మునగ సాగు చేసి నష్టపోయాడు. ధర లేకపోవడంతో పంటను వదిలేశానని చెబుతున్నాడు. ఇలాగయితే పంటలు ఎలా సాగు చేసేదని ఆవేదన చెందుతున్నాడు.

– మద్దికెర

